# పెన్నేటి కతలు

## ఏటుకాడు

ఇంగీ పది రోజులా ఏసోబు దగదగా ఎలిగిపోతాడు. ఏడాది పొడుగూనా కుంటి కుక్క మాదిరి ఏటుకాలేసుకొని[1] తిరుగుతా, యిళ్ళనూ వాళ్ళనూ ఎంగిలి బీడీలు అడుక్కొంటా వుంటాడు. ఇదో ... యీ పదీ పన్నెండు రోజులా మాత్రం ఏసోబు పరాక్రం సెప్పతరం కాదు. శివరాత్రీ, ఉగాదీ పండువ ఆకాసెంలో ఆ పొద్దు[2] గదా కండ్లు సెదిరేట్లుగా కనపడ్తాంటాదే అట్ట ఏసోబు కూడా ఉగ్గరంగా[3] వుంటాడు. ఏడాదంతా ఇంట్లో పెండ్లానికీ కోడండ్లకూ బయపడ్తే ఈ రోన్నాళ్ళా ఏసోబున్జూసి వాళ్ళు బయపడ్తారు. "ఏం పంగుజేసి అల్చిపోయినావని పొద్దుబారెడేక్కే దాకా గోడకు నిగడదన్ని పండుకోనుండావు ... లెయ్యిశా" అని, ఏసోబు పెండ్లాం మరియా సేత్తో అంటే సేత్తో, కాల్తో అంటే కాల్తో జాడిచ్చి లేపేది. ఇప్పుడట్ట లేపడానికి జంకుతాది. మాపటేల మాను కల్లాల్లోంచీ ఇంటి కొచ్చేతలికి కోడండ్లు ఉడుకు నీళ్ళు లడీ జేస్తారు పోసుకోడానికి.[4]

ఊళ్ళో పెద్దోళ్ళంతా యీ పది రోజులా ఏసోబు ఇంటి సుట్టూ తిరుగుతాంటారు. ఏసోబు నిద్దర లేయక ముందే అతగాని కొట్టం కాడికి పోయి "ఏలుకోరా ఏసోబూ" అని మేలుకొలుపులు పాడతాంటారు. "మరియమ్మా, మనాడు నిద్దర లేసినాడా" అని మరియాదగా అడిగి ...'అవుల్లే నాముల మీంద పనంటే మాటలా? పుల్లిక[5] జేసుంటాది' అని కనికరం జూపుతారు. అప్పుడు మరియా మొగున్ని తట్టి 'ఇదో లేయ్, లేయ్యే' అంటా పలానా ఆయనొచ్చినాడని సెపుతాది. ఏసోబు మూల్గుతా యిసుక్కొంటా 'ఏందే నీ...' అని పెండ్లాన్నీ ఆ వచ్చినాయన్నూ కలిపి తిట్టినట్టు తిడ్తాడు. బయటున్న మనిసికి ఇనబన్నా సేసేదేం లేదు. "దగ్గుతాబోతే సొంటి పిరెమేమరి" అనుకొని సవరిచ్చుకొని, యినపడనట్టుంటాడు. ల్యాకపోతే, సొంటి పిరెమాయెనే అని కంటికి సొంటేసుకుని ఏడిస్తే, కంటి సేటు కర్పు సేటు ... అంతేకదా!

ఉత్తప్పుడయితే యాన్నన్నా దావన ఎదురై ఏసోబు ఒక తుంట బీడీ అడిగినా "పోరా నా కొడకా! నీకు పొద్దున లేసిన కాన్నించీ బీడీలు యాడిచ్చేది" అని తిడ్తారు. ఇప్పుడయితే బీడీ



లేంది పీకిరేట్లు తెప్పియ్యమన్నా తెప్పిస్తారు. పిల్మాకు పోవాల లెక్కయ్యమన్నా లేదన్లేరు. "మా పని అయినాక పోరా నాయనా" అని బంగపోవాల. "పొద్దంతా పన్జేసేతలికి మాపిటేలకల్లా వాళ్ళు నొప్పు లైస్తాయి" అని ఏసోబు అంటే, పని అయిపోయినోడు సైగ్గకుండా వుంటాడు గానీ మరుసట్రోజు పనున్నోడు పరుగెత్తి పోయి సారాయి పంపియ్యాల! ఏసోబు పెండ్లామో, కోడండ్లో అంతకు ముందు కూలి ముంతలు బాకీ వున్నా సరే పట్టుక్కోరు. ఏసోబు కూలి ఇరవై రూపాయిలూ నామి దిగేసరికి ... యిదో సామీ అని ఇచ్చి తీరాల. ఏసోబు మాంచి ఏటుకాడు[6]

వాని. పెయ్యి బడిన నామి ఎన్నేండ్లున్నా సెడదని అందరూ అంటారు. ఏసోబు గాక ఇంగా ఇద్దరు ముగ్గురు ఏటుకాళ్ళు ఊళ్ళో వుండారు గానీ వాళ్ళంత మేలైన పనోళ్ళు గాదు. సిన్నా సితకా నాములయితే పరవాలేదుగానీ పెద్దవైతే రోన్నాళ్ళ కల్లా వొరిగిపోయేట్టో, నడి నామిలో నీళ్ళు దిగేట్టో ఏస్తారు. అందుకే పెద్ద నాములోళ్ళంతా ఎట్టనోకట్ట ఏసోబు సేతనే ఏయిచ్చుకొంటారు. ఏసోబు మళ్ళా మంచి సేద్యగాడేం కాదు, ఉదరా బదరా సేద్యగాడే. నాము లేయడంలో వాని పనితనం[7] సూడాల.

నామి బందంగా యేయడమే కాక పనిలో మంచి సేతాళం[8] జూపుతాడు. దండిగా మేత వుండే నామికి ముందు ఆంజనేయుని ఆకారం కనిపిచ్చేట్టు ఏస్తాడు. ఇంగా ఎక్కువగా వుంటే రొండు నాముల్నీ కలిపి వంతెన కట్టినట్టు జాయెంటుగా ఏస్తాడు.

"ఏసోబుకు రోంతజంబం[9] వుంది గానీ నామి ఏసినాడంటే నానమ్మా నా కొడుకు నాడే ఏయ్యాల" అంటారంతా. పాత నాముల్ని జూసినా యిది ఏసోబు ఏసిందేనని కనిపెట్టొచ్చునంటారు. కల్లంలో వాడుంటే ఎక్కల్లేని పుశారు. మేత మోసే కూలోళ్ళను ఆడా మొగా అని సూడకుండా తిడ్తాడు. అందరూ నగుతారే కానీ కొట్లాడరు. తిట్టకుంటే ఏసోబు ఎట్టయితాడులే అన్నట్టుంటారు. అంటే, కూలోళ్ళలో వాళ్ళ వాళ్ళు ఎక్కువగా వుండడం కూడా ఒకట్లే. ఉత్తప్పుడు సొనంబోయే వాని మాదిరిగా వుండే ఏసోబుకు ఏటుగాడై నన్లోకి దిగుతానే అంత వొడుపూ శకితీ యాన్నించీ వొస్తాయో తెల్దు. నామికాపక్క యీపక్క కూలోళ్ళు మేత కట్టలు, ఒకే మొయిన ఊపిలేకుండా యిసిరేస్తా వుంటే, రెండు సేతుల్తో నామ్మింద నుంచీ జవురుకొని అందుకుంటా, సేతుల్తో కాళ్ళతో యాడి మేత ఆడ తొక్కుతా, సరిసేసుకొంటానే వుంటాడు. ఇంగో పక్క మేత రాలేదని ఎచ్చరిస్తా వుంటాడు, ఎగతాళి జేస్తా వుంటాడు ... అర్జునుడు గదా యుద్దెం జేసినట్టే అనుకో.

రొండు కండ్లతో ఆ పనివాటం సూసినోనికి, "ఏందిరా యీడు నన్లోకి దిగినప్పుడు యిట్టా సేస్తాడు గదా, మల్లా ఏడాదంతా ఊరికెట్టావుంటాడబ్బా" అనుకోకుండా వుండడు. ఒక సారి మూలోళ్ళ గోయిందరెడ్డి నామి ఏసేతప్పుడు, కూలోళ్ళు

కూకోని సంగటి తింటా వుండంగా, ఆయనిదే అడిగినాడు. ఏసోబు సంగటి తినడం సాలిచ్చి, నగుతానే ముగిచ్చినట్టు సెప్పినాడు. "గోయిందరెడ్డీ, నీకు మూడు కాండ్ల ఎద్దు లుండాయి. అందులో రొండు కాండ్లు రోజా సేద్యం సేస్తాయి, ఒక్కాడి మను బండ ఈడ్చడానికి మేపే కోడెలు గదా! పందెపు కోడెల్తో మను రోజా సేద్యం సేయిచ్చను. ఒకేల మను సేయిచ్చాలనుకొన్నా[10] అయి సేయను. మామూలు ఎద్దులాల అయి ఎండకూ గాలికీ తట్టుకోలేవు. బండ ఈడ్చడంలో వాటి బలం శౌరెం సూడాల. అట్టనే సేద్యపు ఎద్దులు సచ్చినా బండను జానెడు గుంజలేవు. ఇయి సేద్యం జేయాల, అయి బండ ఈడ్చాల ... అంతే" అని సేతిలో అంతవరకూ వుంట సేస్తావున్న సంగటిని గుటుక్కున నోట్లో ఏసుకొనె.

ఒక రకంగా సెప్పాలంటే ఏసోబు ఏడాదంతా బతికినట్టు కాదు, సావును మోసుకొంటా వున్నట్టే. ఈ నాములు ఏసినన్ని రోజులూ మాత్రం బతికినట్టు. ఈ గ్యాపకమే ఏడాది బతుక్కు[11] బలం. కరెట్టుగా సెప్పాల్నంటే ఉరుపూ సెయ్యనే సెయ్యదని కాదు, యాదో సేసినా యిట్టపడి కాదు, ఇది ల్యాక! ఊళ్ళో వాళ్ళకు నాములేయాల్సిన యీ నాల్రోజులూ తన సుట్టూ తిరిగినా అవతల తన మొగం సూడరని ఏసోబుకూ తెల్సు. వాళ్ళు సూడకపోయినా తానేసిన నాములు తనను సూస్తాయి, తాను వాటిని సూస్తాడు, అది సాలు. కల్లాల్లో నాముల దిక్కు సూస్తే "ఏం ఏసోబూ నువ్వే గదూ మమ్మల్ని ఏసిండేది" అని అయి పలకరిచ్చినట్టుంటాది. ఏసోబు నాయిన సామేలు గూడా ఏటుకాడే గానీ, ఏసోబు నాయన్ను మించిన కొడుకు అనిపిచ్చుకున్నాడు. నాని బిగిచ్చి దిగినాక, 'ఎట్టుంది నాని' అనడిగితే, రంబా ఊరనాసాల వుందనాల్సిందే! ఏసోబును 'ఏ సోబూ'! అని నగుతాపిలిస్తే 'ఊ...' అని మూలుగుతాడు. 'ఏంరో ఏటుగా' అని ఎగతాలిగా పిలిస్తే నగుతా పలుకుతాడు. అట్టాటి ఏసోబుకు ఎన్నడూ ఎరుగని దెబ్బ తగిలె. ఆ రోజు ఏసోబు ఎంగటసామి నాని ఏసినాడు. పనంతా అయిపోయి అప్పుడు కూలోళ్ళు కళ్ళంలో ఆడాడ దుమ్ములో వున్న గడ్డిని ఒక సాటికి ఊడ్చుతాండారు. ఏసోబు సిన్న కోడలు ఎనుముకు రొంతమేత కోసమని గంప సంకనేసుకొని వచ్చింది కల్లంకాడికి. గంప పెద్దదేం గాదు మల్ల సిన్నదే. ఈనడను ఆమె పుట్టింటోళ్ళు ఆమెకు ఎనుమును దోలిచ్చి నారంటలే. కోడల్దెచ్చిన గంపలో ఏసోబు యింత గడ్డి దురుము తాండంగా, కల్లం గోడ[12] మీద కూకొనున్న ఎంగటసామి కొడుకు వొళ్లె వూడి పోయేట్టు పరుగెత్తా వచ్చి అమ్మనూ అక్కనూ తిట్టబట్టె. "మీ మొగుడు యీడ నానేసి నాడని గంప తీసుకొచ్చినావా కులుకుతా?" అని ఏసోబు కోడల్నూ తిట్టె.

ఏసోబు ఏం మాట్లాడకుండా గంపలో మేతను కల్లంలోనే కుమ్మరిచ్చి గంప కోడలి కిచ్చినాడు. తలకాయ పైకెత్తుతానే అప్పుడే పూర్తిచేసిన నానికనపడె. అరనై, దెబ్బయి బండ్ల మేతకు తక్కువుండదు. తలకాయ యీపక్కకు తిప్పకొందామంటే, తను నిన్నేసిన నారాయణరెడ్డి నాని కొండాల కనపడె. ఆ పక్కకు తిప్పకుందామూ అంటే మొన్నేసిన మున్రెడ్డి నాని పెద్ద గుట్టాల కనపడె. ఇంగ తలకాయ ఎట్టా తిప్పకుండా వొంచుకొని కోడల్తో పాటు ఇంటికి నడ్చె. ఆకల్లేదని బువ్వ తినకుండా పండుకొనె. నగిరపొద్దున మరియాకు మెలుకువొచ్చి సూస్తే, గోడకానుకుని కూకుని ఒకతే మొయిన బీడీలు తాగుతాండాడు. 'యీన్నన్నా నొప్పిగా వుందా?' అనడిగితే 'అవు' అనె. 'యాడ?' అంటే, 'యాన్నని సెప్పేదీ?" అనె నిదానంగా. 'ఒళ్ళంతా నొప్పుల్లేసిందేమోలే' అని మరియా అనుకొన్నాది.

తెల్లవార్నాక "నానేయను రమ్మని నాగయ్యొచ్చినాడు ... లే" అని లేపితే "నేను పోను ఫో" అని ఆ పక్కకు తిరిగినాడు. "ఈ పొద్దు రాలేదని సెప్పమంటావా, ఇవరంగా సెప్పవేంది?" అని గట్టిగా అడిగితే, సివుక్కున లేసికూకున్నాడు.

"ఇనే ... ఇనుమల్ల ఇవరంగా సెప్తాండాయిను. యీ పొద్దే గాదు యే పొద్దు గుడకా నేను ఇంగ నాములేయను పోను" అని ఎర్రోని మాదిరిగా అర్సినాడు. అర్సి, వొనుకుతాండే సేతుల్తో పక్కనే వున్న తుంట బీడీల కువ్వలోంచి ఒకటి తీసుకొని ముట్టిచ్చుకొని ... గోడకానుకొనె.

— రామకృష్ణారెడ్డి

1. ఒక కాలు కొద్దిగా యీడుస్తూ నడవడం 2. మూర్ఖుడు 3. ఉగ్రంగా 4. స్నానానికి 5. అలసట 6. గడ్డినాములు వేసేవాడు 7. పవితనం 8. నైపుణ్యం,శిల్పం 9. తలపాగ రు 10. ఎద్దుల వలె 11. బొత్తిగా 12. పంచె






జూన్ నెలలో జన్మించిన పాప పుట్టిన తేదీని పాప తల్లిదండ్రులు పూర్తి వివరాలతో ఈ క్రింది కూపన్ పూర్తిచేసి మే 25వ తేదీలోగా ఎడిటర్, ఆంధ్రజ్యోతి వీక్లీ, పోస్టు బాక్స్ నెం 712, విజయవాడ - 520 010 చిరునామాకు పంపగోరతాం. సకాలంలో మాకు అందిన కూపన్లలో లక్కీడిప్ ద్వారా ముగ్గురు పాపల్ని లక్కీ బేబీస్ ఎన్నికచేసి వారి పుట్టిన రోజున బహుమతులు అందజేయడం జరుగుతుంది. ఈ శీర్షికలో ఏడేళ్ల లోపు బాలబాలికలే పాల్గొనాలి.

జూన్ నెలలో జన్మించిన బాలబాలికలకు మాత్రమే పరిమితం

లక్కీ బేబీ కూపన్

పాప/బాబు పేరు --------------------

పుట్టిన తేది--------------------

తల్లితండ్రుల పూర్తి చిరునామా --------------------

పిన్ కోడ్ ----------------

గడువు తేదీ మే 25

లక్కీ బేబీకి బహుమతులు అందజేస్తున్నవారు :

Guys 'n' Dolls
FASHION SENATE
RAVI MANSION,
LABBIPET, VIJAYAWADA
ఫోన్ నెం: 67898

